సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 7 । డిసెంబర్ । 2024



శబరిమలకు సైకిల్ యాత్ర

విశాఖ: ఆరిలోవ నుంచి నలుగురు అయ్యప్ప స్వాములు గంగాధర్ గురుస్వామి ఆధ్వర్యంలో శబరిమలకు సైకిల్ యాత్ర చేపట్టారు.

వెంకన్నకు పంచామృతాభిషేకం



పెందుర్తి: వేంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సుప్రభాతసేవ, పంచామృత అభిషేకం నిర్వహించారు.



విశాఖ తీరంలో డాల్ఫిన్ కళేబరం

విశాఖ: రుషికొండ రాడిసన్ బ్లూ హోటల్ వెనుక గల బీచ్‌కు శుక్రవారం సాయంత్రం డాల్ఫిన్ కళేబరం కొట్టుకుని వచ్చింది.

న్యూస్‌రీల్

విలువిద్యలో గిరిజన క్రీడాకారుల సత్తా

- జాతీయస్థాయి పోటీలకు ముగ్గురు ఎంపిక



పోటీల్లో పతకాలు సాధించిన బైరాగి నాయుడు, సుధాకర్‌నాయుడు, సాంబశివ

సాక్షి,పాడేరు: విజయవాడలోని శాతవాహన కళాశాలలో ఈనెల 3వతేదీ నుంచి 5వతేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ మెన్ అండ్ ఉమెన్ విలువిద్య పోటీల్లో జిల్లాకు చెందిన గిరిజన క్రీడాకారులు సత్తా చాటారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇండియన్ రౌండ్‌లో గెమ్మెలి బైరాగినాయుడు వెండి పతకం, అడపా సుధాకర్‌నాయుడు, సాలగం సాంబశివ బ్రాంజ్ మెడల్ సాధించారు. వీరు పాడేరులోని అల్లూరి అర్చరీ అకాడమీకి చెందినవారు. ఈనెల 15వతేదీన జార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి సీనియర్ విలువిద్య పోటీలలో పాల్గొంటారు.

పాడేరుకు గోశాల మంజూరు

- పశువుల అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు
- పశుసంవర్ధకశాఖ ఇన్‌చార్జి ఏడీ చంద్రశేఖర్

సాక్షి,పాడేరు: ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతాలకు పశువుల అక్రమ రవాణా నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పశుసంవర్ధకశాఖ పాడేరు ఇన్‌చార్జి ఏడీ డాక్టర్ పి.చంద్రశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుత్తులపుట్టుతో పాటు పలు సంతల్లో పశువుల వ్యాపారులకు అనేకసార్లు హెచ్చరించామని పేర్కొన్నారు. అక్రమ పశువుల రవాణాను అడ్డుకునే లక్ష్యంగా పాడేరుకు గోశాల మంజూరైందన్నారు. ఇందుకు సంబంధించి రెవెన్యూ శాఖ స్థలపరిశీలన జరుపుతోందన్నారు. స్థలం కేటాయించిన వెంటనే గోశాల నిర్మిస్తామని తెలిపారు. పశువుల అక్రమ రవాణాకు సంబంధించి 9848310965కు సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు.

సైబర్ మోసం

- రూ.1.48 లక్షలు కోల్పోయిన బాధితుడు



బాధితుడు పప్పు చిరంజీవి

మోతుగూడెం: సైబర్ మోసగాళ్ల వలలో చిక్కుకుని మోతుగూడెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి రూ.1.48 లక్షలు పోగొట్టుకున్నాడు. గ్రామానికి చెందిన పప్పు చిరంజీవికి యూనియన్ బ్యాంక్‌లో ఖాతా ఉంది. గురువారం తన ఫోన్‌కు వచ్చిన మెసేజ్ లింక్‌ను ఓపెన్ చేశాడు. వెంటనే ఆయన ఖాతాలోని రూ.1.48 లక్షలు మాయమయ్యాయి. దీంతో బాధితుడు వెంటనే యూనియన్ బ్యాంకు మేనేజర్‌ను సంప్రదించాడు. ఖాతాను పరిశీలించిన ఆయన సైబర్ మోసం జరిగిందని చెప్పడంతో బాధితుడు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. బ్యాంక్‌కు సంబంధం లేని లింక్‌లు వస్తే ఓపెన్ చేయవద్దని మేనేజర్ ఈ సందర్భంగా సూచించారు.


క్యారెట్, టమాటాకు డిమాండ్



విక్రయానికి తీసుకువచ్చిన క్యారెట్, టమాటా

డుంబ్రిగుడ: అరకులో శుక్రవారం నిర్వహించిన వారపుసంతలో క్యారెట్, టమాటాకు డిమాండ్ నెలకొంది. కేట్ క్యారెట్‌ను రూ.1200 నుంచి రూ.1500కు వ్యాపారులు కొనుగోలు చేశారు. కేట్ టమాటాను రూ.650 నుంచి రూ.800, కావిడికి రూ.1200 వరకు ధర లభించింది. జైపూర్, విజయనగరం, విశాఖపట్నం ప్రాంతాలకు చెందిన వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి కొనుగోలు చేశారు. వారి ప్రభావం లేకుండా చూడాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

పుష్పయాగానికి విశాఖ నుంచి పువ్వులు



పుష్పాలకు సంకలనం చేస్తున్న అర్చకుడు

ఎంవీపీ కాలనీ (విశాఖ): తిరుమల పద్మావతి అమ్మవారి పుష్పయాగానికి విశాఖ నుంచి పువ్వులు తరలివెళ్లాయి. ఆధ్యాత్మిక వేత్త హిమాంశు ప్రసాద్, కార్తీక దీపోత్సవం టీమ్ ఆధ్వర్యంలో 4 వేల కలువలు, 2 వేల తామర పువ్వులు సేకరించి పంపించారు.

మన్యం ఆర్కిడ్లకు ఊపిరి

గిరిజన వృక్ష శాస్త్ర అధ్యాపకుడి స్ఫూర్తి



డెన్డ్రోలీరియం లాసియోపేటాలం కొత్త రకం ఆర్కిడ్

ప్రకృతి ప్రసాదించిన వృక్షజాతుల్లో కనువిందు చేసే ఆర్కిడ్స్‌కు పాడేరు డిగ్రీ కళాశాల వృక్ష శాస్త్ర విభాగాధిపతి జానకిరావు జరిపిన పరిశోధనలు ఊపిరి పోస్తున్నాయి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న 90 శాతం రకాలను గుర్తించిన ఆయన అరుదైన ఏడు కొత్త రకాలను కనుగొన్నారు. అంతరించిపోయే దశలో ఉన్న వీటి పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలను తన పరిశోధన నివేదికలో పేర్కొన్నారు. ఫలితంగా డాక్టరేట్ పొందారు.



ఏజెన్సీలో సేకరించిన మొక్కలను ఏయూలో పెంచుతున్న జానకీరావు

- పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్ష శాస్త్ర విభాగ అధిపతి జానకిరావు విస్తృత పరిశోధనలు
- అంతరించిపోయే స్థితిలో 90 రకాల గుర్తింపు
- వెలుగులోకి ఎనిమిది కొత్త రకాల ఆర్కిడ్లు
- ఏయూ నుంచి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న జానకిరావు

పాడేరు: వృక్షజాతుల్లో ఆర్కిడ్లు అత్యంత అందమైన ప్రత్యేకమైన జాతి. దేశవ్యాప్తంగా 1,256 రకాలు ఉండగా ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) నివేదిక ప్రకారం వీటిలో చాలా రకాలు అంతరించిపోయే దశలో ఉన్నాయి. రాష్ట్రంలో 73 రకాల ఆర్కిడ్స్ ఉండగా వీటిలో అధికశాతం అల్లూరి జిల్లాలోనే ఉన్నాయన్నారు. వీటికి సంబంధించి ''స్టడీస్ ఆన్ ఆర్కిడ్ డైవర్సిటీ ఇన్ అల్లూరి సీతారామరాజు డిస్ట్రిక్ట్ ఆంధ్రప్రదేశ్ అండ్ ఫైటోకెమికల్ స్క్రీనింగ్ అండ్ బయోలాజికల్ యాక్టివిటీ ఆఫ్ త్రీ సెలెక్టెడ్ ఆర్కిడ్ స్పీసెస్'' అనే అంశంపై పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి.జానకిరావు విస్తృత పరిశోధనలు చేశారు. దీనిలో భాగంగా సుమారు 60 రకాల ఆర్కిడ్ మొక్కలను సేకరించి పరిశోధనలు జరిపారు. ఇందులో అరుదైన ఎనిమిది కొత్త రకాలను గుర్తించారు. ఇవి విజ్ఞాన శాస్త్రానికి ఎంతో దోహదపడతాయని ఆయన చెబుతున్నారు. కొత్తగా కనుగొన్న వాటిలో పెలటాంతేరియా ఇన్సెక్టిఫెర, జ్యూక్సైన్ మొనేయి, డెంద్రోబియం బైకెమెరటం, డెంద్రోబియం క్రేపిడేటం, డెన్డ్రోలీరియం లాసియోపేటాలం, హబినేరియా లసినేట, పెరిస్టైలస్ కాంస్ట్రిక్టస్, ఏపీపోజియం రోసియమ్ అనే కొత్త రకాలు ఉన్నాయి.

ప్రత్యేకతలివీ..

ఆర్కిడ్ మొక్కలు అడవి ఆరోగ్య పరిస్థితికి సూచికలు. ఏమాత్రం కాలుష్యం ఉన్నా ఇవి చనిపోతాయి. పరిశోధనల్లో మూడు ఆర్కిడ్లు వండ టిసెలేట, ఎరైడ్స్ ఓటోరేటా, సింబోడియం ఆలైపోలియం మొక్కలు ఔషధ గుణాలను కలిగి ఉన్నాయన్నారు. వీటి నుంచి సేకరించిన ఔషధాలతో సూడోమోనస్ ఫ్లోరిసెన్స్, స్ట్రెప్టో కోకస్ మ్యూటన్స్, బాసిల్లస్ సబ్టిలిస్, స్టెఫాయిలోకోకస్ ఆరియస్ బాక్టీరియాలపై ప్రయోగాలు జరిపి ఆ బాక్టీరియా మీద బాగా పనిచేందన్నారు.

మన్యం అరుదైన జాతులకు నిలయం

ఆర్కిడ్స్ సంతతి అభివృద్ధికి జిల్లాలోని ఏజెన్సీ వాతావరణం అనుకూలంగా ఉందని ఆయన గుర్తించారు. ఇందుకు గాను ఆంధ్రా విశ్వవిద్యాలయం బోటనీ డిపార్ట్‌మెంట్ నుంచి డాక్టరేట్ పొందారు. పెదబయలు మండలం గంపరాయి పంచాయతీ అల్లంగిపుట్టులో గిరిజన కుటుంబానికి చెందిన ఆయనకు చిన్నప్పటి నుంచి మొక్కలు, పుష్పాలు అంటే ఇష్టం. శాస్త్రవేత్త కావాలనే లక్ష్యంతో ఎమ్మెస్సీ పూర్తి చేశారు. పీహెచ్‌డీలో ప్రవేశం పొంది ఏయూలో వృక్ష శాస్త్ర ప్రొఫెసర్ ఎస్‌బీ పడాల్ వద్ద ఆర్కిడ్ మొక్కలపై విజయవంతంగా పరిశోధన పూర్తి చేశారు.



డెద్రోబియం క్రేపీడేటం ఆర్కిడ్ కొత్త రకం



ప్రకృతి వనరుల పరిరక్షణకు కృషి

స్థానిక ప్రకృతి వనరుల పరిరక్షణలో భాగంగా ఆర్కిడ్స్‌పై పరిశోధనలు చేశా. వీటిలో 90 శాతం మొక్కలు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయి. అయితే జిల్లాలోని ఏజెన్సీ వాతావరణం, ఉత్తర తూర్పు రాష్ట్రాలతో పోలి ఉంది. ఇక్కడ ఆర్కిడ్ మొక్కల పెరుగుదలకు అనుకూలం. వీటి పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై పరిశోధన నివేదికలో పేర్కొన్నా. ఆర్కిడ్ మొక్కలపై తాను చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ అందుకోవడం ఎంతో ఆనందంగా ఉంది.

– డాక్టర్ పి.జానకిరావు, వృక్షశాస్త్ర విభాగాధిపతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాడేరు.

సూపర్ సిక్స్ పేరిట పచ్చి మోసం

కూటమి వైఖరిపై మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ధ్వజం



అడ్డతీగల: సూపర్ సిక్స్ పేరిట ప్రజలతో ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన వారిని కూటమి ప్రభుత్వం పచ్చి మోసం చేసిందని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. ఎల్లవరంలోని ఆమె స్వగృహంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అధికార పార్టీ పాలనపై నిప్పులు చెరిగారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి ఒక సిలిండర్ ఇచ్చి మభ్యపెట్టారన్నారు. నిరుద్యోగులకు డీఎస్సీ ద్వారా డిసెంబర్ నాటికి టీచర్ నియామకాలు చేపడతామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు కాలయాపన చేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఊసెత్తడం లేదన్నారు. ఇంట్లో చదువుకునే పిల్లలు ఎంతమంది ఉన్నా అందరికీ రూ.15 వేల చొప్పున తల్లికి వందనం పేరిట ఇస్తామన్న ఎన్నికల హామీ గాలికొదిలేశారన్నారు. 18 ఏళ్లు పైబడిన మహిళలకు నెలకు రూ.1500 నగదు ప్రతినెలా వారి ఖాతాల్లో జమ చేస్తామన్న విషయాన్ని విస్మరించారని విమర్శించారు. హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వ పెద్దలు ప్రతిపక్ష పార్టీల మీద మాత్రం కక్ష సాధింపులకు పాల్పడడంలో ముందున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వానికి లేని విధంగా ప్రజల నుంచి కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందని ఆరోపించారు.

మహనీయుడు బీఆర్ అంబేడ్కర్



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు



మోతుగూడెంలో అంబేడ్కర్ వర్ధంతిలో పీవో అపూర్వ భరత్ తదితరులు

- పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు
- క్యాంప్ కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత వర్ధంతి నిర్వహణ

పాడేరు : దళిత, బడుగు, బలహీన వర్గాల వికాసానికి పాటుపడి అంటరానితనం, కుల వివక్షపై అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. ఆయన వర్ధంతిని శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర రాజధాని విజయవాడ నడిబొడ్డున 15 ఎకరాల్లో సుమారు రూ.268 కోట్లు వెచ్చించి 125 అడుగుల అంబేడ్కర్ మహా శిల్పం ఏర్పాటు చేశారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని, రాజకీయంగా, సామాజికంగా సముచిత స్థానం కల్పించారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ద్వారానే అంబేడ్కర్ ఆశయ సాధన సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, మాజీ ఏఎంసీ చైర్మన్ కూతంగి సూరిబాబు, ఎంపీటీసీలు దూసురి సన్యాసిరావు, రామకృష్ణపాత్రుడు, పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కూడా సురేష్‌కుమార్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు వనుగు బసవన్నదొర, సర్పంచ్‌లు వంతాల రాంబాబు, గొల్లోరి నీలకంఠం, పార్టీ వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు డీపీ రాంబాబు పాల్గొన్నారు.

మోతుగూడెం: బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక జగదాంబ సెంటర్లో ఆయన విగ్రహానికి చింతూరు పీవో అపూర్వ భరత్ పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ (సీఈ) వాసుదేవరావుతో పాటు జెన్‌కో ఉన్నతాధికారులు నివాళులు అర్పించారు. ఈఈ వరప్రసాద్, డీఈ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రత్యేక నిధులు

- రూ.10 వేల కోట్లు కేటాయించాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స డిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

పాడేరు : జిల్లా సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేల కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స డిమాండ్ చేశారు. శుక్రవారం పాడేరులో ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 4,5తేదీల్లో నిర్వహించిన జిల్లా మహాసభల్లో 20 అంశాలపై తీర్మానం చేశామన్నారు. జిల్లా పరిపాలన, అభివృద్ధి, సంక్షేమం, గిరిజన చట్టాలు, హక్కుల అమలు కోసం పాడేరు కేంద్రంగా జెడ్పీ సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో డోలి మోతలు నిర్మూలించి, రహదారి, రవాణా, కమ్యూనికేషన్ వ్యవస్థలను మెరుగుపర్చాలన్నారు. నిరుద్యోగ యువత కోసం చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. జీవో నంబరు 3 రద్దుతో ఏజెన్సీలో నిరుద్యోగ సమస్య అధికమైందన్నారు. షెడ్యూల్డ్ ఏరియా ఉద్యోగ నియామకాల చట్టం చేయాలని డిమాండ్ చేయాలన్నారు. ఆదివాసీ మాతృభాషా వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, గిరిజన నిరుద్యోగ యువత కోసం స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలని ఆయన కోరారు. గిరిజన కాఫీ రైతులకు చెల్లించాల్సిన రూ.62 కోట్ల కాఫీ బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. పీవీటీజీ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి సమస్యలను పరిష్కారించాలన్నారు. పీసా కమిటీ, అటవీ హక్కుల పరిరక్షణ కమిటీల ఎన్నికలను నిర్వహించాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగుపర్చాలని, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచి రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు కల్పించాలన్నారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఎం తమ పోరాటాలను కొనసాగిస్తుందన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాలికి లక్కు, ఎల్. సుందర్‌రావు, దాస్, పాల్గొన్నారు.

పీహెచ్‌సీలకు సకాలంలో హాజరు కావాలి

- లేకుంటే శాఖాపరమైన చర్యలు
- రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం హెచ్చరిక



వెలగపల్లి పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న పీవో సింహాచలం

రంపచోడవరం/దేవీపట్నం: ఏజెన్సీలో పీహెచ్‌సీలకు వైద్యులు సకాలంలో హాజరు కావాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం హెచ్చరించారు. దేవీపట్నం మండలం వెలగపల్లి పీహెచ్‌సీని శుక్రవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఆస్పత్రిలో వైద్యుల వివరాలు, ఎంత మంది విధులకు హాజరయ్యారన్న వివరాలపై ఆరా తీశారు. పీహెచ్‌సీకి వైద్యులు సకాలంలో హాజరు కాకపోవడంపై నోటీసులు జారీ చేయాలని ఏడీఎంహెచ్‌వోను ఆదేశించారు. పీవో మాట్లాడుతూ పీహెచ్‌సీలకి వైద్యులు సకాలంలో వెళ్లడం ద్వారా అక్కడ వచ్చిన రోగులకు, అత్యవసరాల కేసులకు మెరుగైన వైద్యం అందించే అవకాశం ఉంటుందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో వైద్యులు సేవా దృక్పథంతో పనిచేయాలన్నారు. పీహెచ్‌సీల్లో మందులు అందుబాటులో ఉంచాలన్నారు.

విద్యార్థినులతో పందిరి పనులు



పందిరి పనుల్లో నిమగ్నమైన విద్యార్థినులు

జి.మాడుగుల: విద్యాలయాల్లో పిల్లలకు ఎటువంటి పనులు అప్పగించకూడదని ఉన్నతాధికారుల నుంచి హెచ్చరికలు ఉన్నా కొన్నిచోట్ల నిర్వాహకులు తమకు పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. మండలంలో కె.కోడాపల్లి పంచాయతీ బందవీధిలోని జీటీడబ్ల్యూఏ బాలికల పాఠశాలలో శుక్రవారం ఇదే పరిస్థితి నెలకొంది. విద్యార్థినులతో పందిరి పనులు చేయించడంపై వారి తల్లిదండ్రులు మండి పడుతున్నారు. చదువులు ఎగ్గొంటించి వారితో వెట్టిచాకిరి పనులు చేయించడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ నెల 7న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాఠశాలలో సమావేశం నిర్వహించనున్న సందర్భంగా ప్రవేశద్వారం వద్ద పందిరి పనులు చేయించడంపై వారు తప్పు పడుతున్నారు. దీనిపై హెచ్‌ఎం శాంతికుమారిని వివరణ కోరగా ఆశ్రమ పాఠశాలలో పందిరి పనులు ఇక్కడి విద్యార్థినులతో కాకుండా బయట పిల్లలతో చేయించామని తెలిపారు. శనివారం జరిగే మెగా పేరెంట్స్ సమావేశానికి పాఠశాలలోపల ముగ్గుల పనులు మాత్రం తమ పిల్లలు చేశారన్నారు. తమ విద్యార్థినులు కాకుండా బయట పిల్లలు పందిరి పనులు చేశారని ఆమె వివరించారు.

సత్వర వైద్యమేదీ?

- ముందుకు సాగని కొత్త పీహెచ్‌సీల ఏర్పాటు
- గత ప్రభుత్వ ప్రతిపాదనలు పట్టని కూటమి సర్కారు
- ప్రాథమిక వైద్యానికి గిరిజనుల దూరం
- మారుమూల గ్రామాల్లో ఆర్‌ఎంపీ వైద్యమే గతి

10లో

ప్లాస్టిక్ రహిత అడవులే లక్ష్యం

సబ్ డీఎఫ్‌వో రాఘవరావు, రేంజర్ కరుణాకర్



సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలతో అటవీ సిబ్బంది, అధికారులు

కూనవరం: ప్లాస్టిక్ రహిత అడవులుగా ఉంచాలన్నదే అటవీశాఖ లక్ష్యమని సబ్ డీఎఫ్‌వో కేవీఎస్ రాఘవరావు, రేంజర్ ఎం. కరుణాకర్ అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా భగవాన్‌పురం, రేపాక, కూటూరు, ముల్లూరు గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను శుక్రవారం తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత అడవులుగా ఉంచేందుకు ప్రజల సహకారం తప్పనిసరి అని అన్నారు. సుమారు 35 మంది అటవీ సిబ్బందితో కలసి 158 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి సంచుల్లో నింపారు. వీటిని పెదార్కూరు సచివాలయ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌వో అనిల్, సాయి వెంకటరమణ, శంకర్‌రెడ్డి, దేశయ్య, ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీలు



ఏడుగురాళ్లపల్లి సంతలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు



కొయ్యూరులో పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చింతూరు: మావోయిస్టుల వారోత్సవాలకు వ్యతిరేకంగా అల్లూరి ఆదివాసీ యువజన సంఘం, గిరిజన అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని ఏడుగురాళ్లపల్లి వారపు సంతలో ఆదివాసీలు ర్యాలీ నిర్వహించారు. గిరిజనులకు ఉపయోగపడని వారోత్సవాలు వద్దు, రహదారుల నిర్మాణంలో భాగమైన యంత్రాలను దగ్ధం చేసి అభివృద్ధిని అడ్డుకోవద్దంటూ వారు నినాదాలు చేశారు. అనంతరం పలు గ్రామాల్లో పోస్టర్లను అతికించారు.

కొయ్యూరు: సీపీఐ మావోయిస్టులకు వ్యతిరేకంగా శుక్రవారం పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులు రెండు కిలోమీటర్ల మేర ర్యాలీ నిర్వహించారు. ఎవరి కోసం మావోయిస్టులు వారోత్సవాలు చేస్తున్నారో అర్థం కావడం లేదని.. అలాంటి వారోత్సవాలు వద్దని గిరిజన విద్యార్థి సంఘం పేరిట ఏర్పాటు చేసిన బ్యానర్‌తో ర్యాలీ నిర్వహించారు. ఎవరి కోసం స్థూపాలు కట్టాలి.. దేని కోసం వారోత్సవాలు జరపాలని బ్యానర్‌పై పేర్కొన్నారు. మావోయిస్టులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మన్యం అభివృద్ధి ఆగిపోవడానికి పరోక్షంగా వారే కారకులంటూ పేర్కొన్నారు. మంప ఎస్‌ఐ శంకర్‌రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

సత్వర వైద్యమేదీ?

- ముందుకు సాగని కొత్త పీహెచ్‌సీల ఏర్పాటు
- గత ప్రభుత్వ ప్రతిపాదనలు పట్టని కూటమి సర్కారు
- ప్రాథమిక వైద్యానికి మారుమూల గ్రామాల గిరిజనులు దూరం

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని ప్రాథమిక కేంద్రాల విస్తరణ, కొత్త పీహెచ్‌సీల ఏర్పాటుపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతిపాదనలను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా కొత్త పీహెచ్‌సీలను ప్రకటించినప్పటికీ వాటిలో గత ప్రభుత్వం ప్రతిపాదించిన ఆరు పీహెచ్‌సీలలో ఒకటి కూడా మంజూరు చేయలేదు.
- ఒడిశా సరిహద్దు ముంచంగిపుట్టు మండలం బూసిపుట్టులో పీహెచ్‌సీ ఏర్పాటుపై పాలకులు, జిల్లా యంత్రాంగం దృష్టి సారించడం లేదు. దీంతో ఆయా ప్రాంతాల్లోని మారుమూల గ్రామాల నుంచి రోగులను ఆస్పత్రులకు తరలించడం కష్టంగా మారింది.
- వైద్యసేవలు అందుబాటులో లేకపోవడంతో మారుమూల ప్రాంతాల గిరిజనులు ఆర్‌ఎంపీల వైద్యంపై ఆధారపడుతున్నారు. పీహెచ్‌సీలకు మారుమూల గ్రామాలు దూరంగా ఉండడంతో వైద్యబృందాలు చేరుకోవడానికి జాప్యం జరుగుతోంది.


పాడేరు మండలం గుత్తులపుట్టులో ప్రైవేట్ ఆర్‌ఎంపీ వైద్యశాల


ముంచంగిపుట్టు మండలం మారుమూల బూసిపుట్టు సంతలో ఆర్‌ఎంపీ వైద్యుడి సేవలు

గత ప్రభుత్వంలో నిర్ణయించినా..

ముంచంగిపుట్టు, పెదబయలు, జి.మాడుగుల మండలాల్లోని మారుమూల గ్రామాలతో పాటు సరిహద్దు ఒడిశా గిరిజనులకు ప్రధాన జంక్షన్ అయిన మద్దిగరువులో పీహెచ్‌సీ ఏర్పాటు అవసరమని గత ప్రభుత్వం గుర్తించింది. దీంతోపాటు జి.మాడుగుల మండలం సొలబం, పెదబయలు మండలం పెదకోడాపల్లి, హుకుంపేట మండలం మజ్జివలస, కొయ్యూరు మండలం నడిమిపాలెం, పాడేరు మండలం డోకులూరులో కూడా ఏర్పాటుకు ప్రతిపాదించింది. కూటమి ప్రభుత్వం వీటిపై దృష్టి సారించక పోవడంతో ప్రతిపాదనలకే పరిమితం అయ్యాయి.

గత ప్రభుత్వం ప్రతిపాదించిన పీహెచ్‌సీలు

మండలం	ప్రాంతం	జనాభా
హుకుంపేట	మజ్జివలస	10,890
పెదబయలు	పెదకోడాపల్లి	16,522
పాడేరు	డోకులూరు	20,035
పెదబయలు	మద్దిగరువు	15,225
కొయ్యూరు	నడింపాలెం	14,553

పీహెచ్‌సీల ఏర్పాటుపై దృష్టి పెట్టాలి



మూడు మండలాలకు ప్రధాన జంక్షన్ అయిన మద్దిగరువులో పీహెచ్‌సీ ఏర్పాటును గిరిజనులంతా కోరుతున్నారు. అత్యవసర వైద్యానికి దూరంగా ఉన్న జి.మాడుగుల పీహెచ్‌సీ, పాడేరు జిల్లా ఆస్పత్రులకు రోగులు తరలివెళ్తున్నారు. సంత రోజున ఆర్‌ఎంపీ వైద్యుల వద్ద వైద్యసేవలు పొందుతున్నారు. మద్దిగరువులో పీహెచ్‌సీని వెంటనే ఏర్పాటు చేయాలి – ఎస్.మాలన్న, సర్పంచ్, బొయితిలి, జి.మాడుగుల మండలం

ప్రైవేట్ వైద్యమే దిక్కు



అత్యవసర పరిస్థితుల్లో వైద్యానికి గుత్తులపుట్టులోని ప్రైవేట్ వైద్యులే ఆధారం. డోకులూరు కొత్తగా ఆస్పత్రి ఏర్పాటు చేస్తే తమ మారుమూల గ్రామాలకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రభుత్వ వైద్యం పొందాలంటే పాడేరు జిల్లా ఆస్పత్రి, మినుములూరు పీహెచ్‌సీలకు వెళ్లడానికి దూరభారం అవుతోంది.

– మజ్జి బుల్లమ్మ, దుమ్మాపుట్టు, పాడేరు మండలం

పెదకోడాపల్లి పీహెచ్‌సీ ఏర్పాటుతో ఎంతో మేలు



పెదకోడాపల్లిలో కొత్తగా పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని తామంతా కోరుతున్నాం. ఇక్కడ పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తే పాడేరు మండలంలోని గుత్తులపుట్టు, గబ్బంగి, కించూరు, పెదబయలు మండలంలోని పెదకోడాపల్లి, కుంతుర్ల, కిముడుపల్లి పంచాయతీల్లోని 150 గ్రామాల గిరిజనులకు సత్వర వైద్యం అందుతుంది.

– ఎం.చిన్నాలమ్మ, పెదకోడాపల్లి,పెదబయలు మండలం

ప్రభుత్వానికి మళ్లీ ప్రతిపాదనలు



ఏజెన్సీలో కొత్త పీహెచ్‌సీల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఆయా ప్రాంతాల్లోని జనాభా, వైద్యసేవలు విస్తరణ అంశాలను పరిగణనలోకి తీసుకుని జిల్లా అధికారులు కూడా కొత్త పీహెచ్‌సీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. తొందరలోనే కొత్త పీహెచ్‌సీలు మంజూరవుతాయి. ఆయా మారుమూల గ్రామాల్లో వైద్యసేవలపై ప్రస్తుత పీహెచ్‌సీల వైద్యబృందాలను అప్రమత్తం చేస్తున్నాం.

– డాక్టర్ జమాల్‌బాషా, డీఎంహెచ్‌వో, పాడేరు

క్లుప్తంగా

అనారోగ్యంతో గిరిజన బాలిక మృతి


మనీషా(ఫైల్)

ఎటపాక: ఎటపాక మండల నల్లకుంట పంచాయతీలోని రాఘవాపురం గ్రామానికి చెందిన పొడియం మనీషా(16) క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ శుక్రవారం మృతి చెందింది. అయితే ఐటీడీఏ పీఓ సూచించినా బాలిక వైద్యంపై అధికారులు నిర్లక్ష్యం వహించారంటూ బాలిక కుటుంబ సభ్యులు, గిరిజన సంఘాల నేతలు శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. చింతూరు మండలం బొడ్డుగూడెం ఆశ్రమ పాఠశాలలో మనీషా పదో తరగతి చదువుతుండగా క్యాన్సర్ వ్యాధి బారిన పడి ఆరోగ్య శ్రీ ద్వారా హైదరాబాదులోని బసవతారకం ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నట్లు తెలిపారు. మనీషా తల్లిదండ్రులు దినసరి కూలీలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వెళ్లి వచ్చేందుకు ఆర్థిక ఇబ్బందులు వచ్చాయని ఖర్చుల నిమిత్తం సహాయం కోసం ఐటీడీఏని ఆశ్రయించారన్నారు. ఈ విషయాన్ని పరిశీలించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో పుల్లయ్యకు పీవో ఆదేశించారని బాలిక తండ్రి శ్రీను చెప్పారు. దీనిపై పలుమార్లు అధికారిని కలిసినా ఫలితం లేకుండా పోయిందని చెప్పారు. నిర్లక్ష్యం వహించిన అధికారిపై చర్య తీసుకుని బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

రోలర్ స్కేటింగ్‌లో మురారికి బంగారుపతకం



సీతమ్మధార: తమిళనాడు రాష్ట్రం కొయంబత్తూర్ పొల్లాచిలో జరిగిన 62వ జాతీయ రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ పోటీలలో విశాఖ యువకుడు బంగారు పతకం సాధించాడు. నగరంలోని 24వ వార్డు పాత రేసపువానిపాలెంకి చెందిన చందక వెంకట నాగ మురారి అండర్ 14 విభాగంలో బంగారు పతకం సాధించాడు. బంగారు పతకం సాధించిన మురారికి పలువురు అభినందనలు తెలిపారు. ఈ పోటీలలో దేశంలోని 23 రాష్ట్రాలకు చెందిన 69 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

రేపు బీచ్‌రోడ్‌లో సబ్‌మెరైన్ డే

తాటిచెట్లపాలెం: 1967 డిసెంబర్ 8న మొదటి జలాంతర్గామి ఐఎస్ఎస్ కల్వరి భారత నౌకాదళంలో చేరింది. దీని గుర్తుగా ఇండియన్ నేవీ ఏటా డిసెంబర్ 8న సబ్‌మెరైన్ దినోత్సవం నిర్వహిస్తోంది. ఈ మేరకు బీచ్‌రోడ్‌లోని కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం వద్ద ఆదివారం సాయంత్రం 5.15 గంటల నుంచి ఈఎన్‌సీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పలు భాషల పాటలకు మధురమైన సంగీతం జోడించి నేవీబ్యాండ్ అలరించనుంది. అధిక సంఖ్యలో ప్రజలు ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు వీలుగా బీచ్‌రోడ్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సాగరతీరం.. సునీత గానం


హాజరైన ప్రేక్షకులు


తన పాటలతో శ్రోతలను ఉర్రూతలూగిస్తున్న సునీత

ఏయూ క్యాంపస్ (విశాఖ) : సాగర తీరం..చల్లని గాలులు....ఓ కోకిల స్వరం వీనులవిందు చేసింది. ప్రముఖ గాయని సునీత తన సుమధుర గాత్రంతో విశాఖ వాసులను ఓలలాడించారు. సునీత లైవ్ కాన్సర్ట్ పేరుతో ఆర్కే బీచ్ శుక్రవారం రాత్రి నిర్వహించిన సంగీత కార్యక్రమం ఆకట్టుకుంది. అందంగా లేనా... అసలేం బాలేనా అంటూ...గోదావరి సినిమాలోని పాటతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. చిన్ని చిన్ని ఆశ.. ముద్దుముద్దు ఆశ ఆమె ఆలపిస్తుండగా.. యువత గొంతు కలిపారు. నా చెలి రోజావే.. నాతో ఉన్నావే అంటూ యువతలో జోష్ నింపారు.సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్‌తో కలిసి సునీత పలు చిత్రాల్లో పాటలు పాడి అలరించారు.

పాత విధానంలోనే ఉపాధి పనులు చేయించాలి


ఉపాధి పనులను పరిశీలిస్తున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి చిన్నయ్యపడాల్

ముంచంగిపుట్టు: పాతపద్ధతిలోనే ఉపాధి హామీ పనులు కల్పించాలని కర్రిముఖిపుట్టు పంచాయతీ సర్పంచ్ జి.పుల్‌మొత్తి అన్నారు. కర్రిముఖిపుట్టు పంచాయతీ తాంగుల గ్రామాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి కూలీలకు కల్పించే విధంగా నిబంధనలు తీసుకురావడం సరైన పద్ధతి కాదన్నారు. ఇందులో భాగంగా పనులు చేసే సమయంలో రెండు స్లారు ఫోటోలు తీయడం, అప్‌లోడ్ చేయాల్సి రావడంతో ఇబ్బందులు పాడాల్సి వస్తుందని, అప్‌లోడ్ కాకపోతే పనిచేసిన సొమ్ము జమ కాని దుస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వాలు పాత విధానంలోనే ఉపాధి పనులు చేయించాలని, లేని పక్షన ఉపాధి కూలీలతో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ, సీపీఎం నాయకులు అర్జున్, జీనబంధు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: ఉపాధి హామీ పథకం ద్వారా వేతనదారులకు 15 రోజులకే కూలీ సొమ్ము చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. తాజంగి పంచాయతీ పరిధిలోని వంతమామిడి గ్రామంలో చేస్తున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కార్మిక చట్టాలకు తగ్గట్టుగా కూలీలకు కనీస అవసరాలు సమకూర్చడంలో విఫలమవుతుందన్నారు. కూలీలకు పని కల్పించిన చోట ఎటువంటి ఏర్పాట్లు చేయడం లేదని ఆరోపించారు. కూలి సొమ్మును సకాలం అందించకుండా గిరిజనులను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

పథకాల అమలుపై గ్రామాల్లో సర్వే


కించుమండలో సర్వే నిర్వహిస్తున్న టీడబ్ల్యూడీ ప్రోగ్రాం మేనేజర్ రాము, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్

డుంబ్రిగుడ: గిరిజన కుటుంబాల సమగ్ర సమాచారాన్ని రైజ్ ట్రైబ్స్ యాప్ ద్వారా సమగ్ర సర్వే నిర్వహించి ఆదాయ పెంపునకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని రాష్ట్ర టీడబ్ల్యూడీ ప్రోగ్రాం మేనేజర్ హరేరాము అన్నారు. మండలంలోని కించుమండ పంచాయతీ కేంద్రంలో గిరిజన కుటుంబాల సమగ్ర సమాచారాన్ని సేకరించారు. ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టు గ్రామాలుగా కించుమండ, పెదలబుడు గ్రామాల్లో ఎంపిక చేసినట్టు చెప్పారు. రైజ్ ట్రైబ్స్ యాప్ ప్రత్యేక వివరాలను సేకరించి గిరిజన కుటుంబాలకు సంక్షేమ పథకాలు, ఆదాయ పెంపుతో పాటు అభివృద్ధికి అవసరమైన తోడ్పాటును అందించేందుకు వీలుంటుందన్నారు. రాష్ట్ర మంతటా ఈ యాప్ అమలుకు ముందుగా ఎంపిక చేసిన ఆయా గ్రామాల్లో సర్వే ద్వారా సమగ్ర సమాచారాన్ని సేకరిస్తున్నామన్నారు. ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం వైపు గిరిజనులను మళ్లించాలి

- ఏవోబీలో గంజాయి సాగును పూర్తిగా ధ్వంసం చేయాలి
- డీజీపీ ద్వారకా తిరుమలరావు


డీఐజీ, ఎస్పీలతో సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ ద్వారక తిరుమలరావు

సాక్షి, విశాఖపట్నం: ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే గంజాయి వ్యాపారస్తులు గిరిజనులను మభ్యపెట్టి వారిని ఉచ్చులోకి లాగుతున్నారని డీజీపీ ద్వారకా తిరుమలరావు అన్నారు. శుక్రవారం విశాఖ రేంజ్ డీఐజీ కార్యాలయాన్ని డీజీపీ సందర్శించారు. అనంతరం రేంజ్ పరిధిలో ఎస్పీలతో సమావేశం నిర్వహించారు. గంజాయి పంట వలన జరిగే నష్టాలను వివరించి, వాణిజ్య పంటలు వేసుకునేలా గిరిజనులు అవగాహన కల్పించాలన్నారు. ఏపీని గంజాయి, మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఏవోబీ ప్రాంతంలో గంజాయి సాగును పూర్తి స్థాయిలో ధ్వంసం చేయాలని ఆదేశించారు. రేంజ్ పరిధిలో ఉన్న జిల్లాల అధికారులు ఒడిశా పోలీసులతో సమన్వయం చేసుకొని, గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టులను, డైనమిక్ చెక్‌పోస్టులను పటిష్టం చేయాలన్నారు. సమావేశంలో విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, శ్రీకాకుళం ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, పార్వతీపురం మన్యం ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ
- మీకోసంలో 94 వినతుల స్వీకరణ


ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్

పాడేరు : ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి సంబందిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ సూచించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, డీఆర్వో పద్మాలత ప్రజల నుంచి 94 వినతులను స్వీకరించారు. ప్రధానంగా తాగునీటి సమస్య, రహదారుల నిర్మాణం, అటవీ హక్కు పత్రాల మంజూరు, ఉపాధి అవకాశాలు కల్పన, పక్కా ఇళ్ల మంజూరు, గృహ నిర్మాణాలకు బిల్లుల మంజూరు తదితర అంశాలపై అర్జీలు అందినట్టు అధికారవర్గాలు తెలిపాయి. సంబంధిత శాఖల అధికారులు అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ కొండయ్య పడాల్, డీడబ్ల్యూ ఇంజనీరింగ్, ఆర్‌అండ్‌బీ ఈఈలు డేవిడ్‌రాజు, వేణుగోపాల్, బాల సుందరబాబు, డీపీవో లవరాజు, ఐటీడీఏ ఏవో హేమలత, ఎల్‌డీఎం మాతునాయుడు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రమేష్ కుమార్ రావు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


మాట్లాడుతున్న వై.రామవరం తహసీల్దార్ వేణుగోపాల్


ఎటపాకలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్బారావు

ఎటపాక: ఇసుక రీచ్‌లు, వాగుల నుంచి అవసరాలకు మాత్రమే ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల నుంచి ఇసుకను తెచ్చుకోవాలని తహసీల్దార్ సుబ్బారావు తెలిపారు. మండలంలోని ట్రాక్టర్ ఓనర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు మాత్రమే ఇసుక తెచ్చుకోవాలని రాత్రి సమయాల్లో ఇసుక రవాణా చేయవద్దని హెచ్చరించారు. ఇసుక పాలసీ చట్టాన్ని అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఐ పార్థసారధి ఉన్నారు.

వై.రామవరం: మండలంలో మంజూరైన గృహ నిర్మాణాలకు అర్హులైన లబ్ధిదారులు ఇసుకను తీసుకెళ్లవచ్చని తహసీల్దార్ పి.వేణుగోపాల్ లబ్ధిదారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ అవసరమైన ఇసుక రవాణాకు అనుమతి పత్రాలు జారీ చేస్తామన్నారు. కొండవాగులు, వంతెనలకు దూరంగా ఇసుక తవ్వాలని సూచించారు. కాంట్రాక్టర్లు ఇసుక అక్రమ రవాణా వ్యాపారం చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించి ఇసుక తవ్వకాలు చేసిన ట్రాక్టర్లను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీజ్ చేశామన్నారు.

ఏయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి సర్వం సిద్ధం

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం ‘వేవ్స్– 2024’కు సర్వం సిద్ధమైంది. శనివారం మధ్యాహ్నం 3గంటల నుంచి బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఈ కార్యక్రమం జరగనుంది. ఈ సంవత్సరం నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా ఎల్‌అండ్‌టీ చైర్మన్ ఎస్.ఎన్ సుబ్రహ్మణ్యన్, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ పద్మశ్రీ డాక్టర్ ఎస్‌వీ ఆదినారాయణరావు ప్రత్యేక అతిథిగా హాజరుకానున్నారు. రాష్ట్ర మానవ వనరులు, ఐటీ ఎలక్ట్రానిక్స్ ఆర్.టి.జి శాఖ మంత్రి నారా లోకేష్ , ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ జి.ఎం. రావు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3గంటల నుంచి బీచ్ రోడ్ లోని కన్వెన్షన్ సెంటర్ వేదికగా కార్యక్రమాలు జరుగుతాయి. సాయంత్రం 3.30 గంటల నుంచి 5.30గంల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, విభిన్న రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థుల అభిప్రాయాలు, పరిచయ కార్యక్రమాలు,ప్రసంగాలు జరుగుతాయి. కార్యక్రమం ఏర్పాట్లను ఏయూ వీసీ ఆచార్య జి. శశిభూషణ రావు శుక్రవారం తన చాంబర్‌లో వివిధ విభాగాధిపతులతో సమీక్షించారు.

గంజాయి కేసులో ఒకరికి పదేళ్ల జైలు

విశాఖ లీగల్: గంజాయి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ నగరంలోని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ శుక్రవారం తీర్పునిచ్చారు. జైలు శిక్షతోపాటు రూ.1,25,000 జరిమానా చెల్లించాలని, లేని పక్షంలో అదనంగా ఆరు నెలల సాధారణ శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. డిప్యూటీ డైరెక్టర్ ప్రాసిక్యూషన్ జి.ఎస్.ఎన్.వి.ప్రసాదరావు తెలిపిన వివరాలివీ.. నిందితుడు బియ్యాని సత్తిబాబుది అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం బెన్న ధూమ్పాలపట్నం. 2015 మార్చి 9వ తేదీ సాయంత్రం తన గ్రామంలోని పశువుల శాల దగ్గర 40 కిలోల గంజాయి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఈ సమాచారం అందుకున్న రోలుగుంట పోలీసు అధికారులు బి.కృష్ణారావు, సీహెచ్ హరికృష్ణ అతన్ని పట్టుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి నేరాభియోగపత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

ఫార్మాసిటీలో మరో ప్రమాదం

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో శుక్రవారం సాయంత్రం మరో ప్రమాదం చోటుచేసుకుంది. ఫార్మాసిటీలో విజయశ్రీ ఆర్గానిక్స్ పరిశ్రమలో శుక్రవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో విష రసాయనాలు మీద పడడంతో ఇరువురు కార్మికులు తీవ్ర గాయపడ్డారు. మెరుగైన వైద్యం కోసం నగరంలోని ప్రవేటు ఆస్పత్రికి తరలించారు. వివరాలిలా ఉన్నాయి.. విజయశ్రీ ఆర్గానిక్స్ పరిశ్రమలో ప్రొడక్షన్ బ్లాక్-1లో ఏఎన్ఎఫ్-డి రియాక్టర్ మ్యాన్ హోల్ ఓపెన్ చేసిన మంటలు ఎగసిపడ్డాయి. ఆ సమయంలో విధి నిర్వహణలో ఉన్న ఏఎన్ఆర్‌గా పనిచేస్తున్న రజ్జా, మరో ఉద్యోగి సీసిహెచ్. వెంకట సత్య సుబ్రమణ్య స్వామి తీవ్రంగా గాయపడ్డారు. రజ్జాకు రెండు చేతులు కాలిపోగా స్వామి స్వల్పంగా గాయపడ్డాడని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. తీవ్రంగా గాయపడిన వీరిని నగరంలోని ఇండాస్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందిన వెంటనే పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు ఘటన స్థలానికి వెళ్లి కారణాలు తెలుసుకున్నారు.

‘ఆర్టీసీ’ క్రీడా పోటీలు ప్రారంభం

- కైలాసగిరి పోలీస్ పరేడ్ గ్రౌండ్ వేదికగా అంతర్ ఆర్టీసీ ఉద్యోగుల అథ్లెటిక్ మీట్
- తొలిరోజు ఉత్సాహంగా పోటీలు


మార్చ్‌పాస్ట్‌లో తల్లితో పాల్గొన్న చిన్నారి


నువ్వా.. నేనా..: మెన్ 800 మీటర్ల పోటీలో పరుగు పెడుతున్న అథ్లెట్లు


అలరించిన థింసా నృత్య ప్రదర్శన


పోటీలు ప్రారంభిస్తున్న ఆర్టీసీ చైర్మన్ నారాయణరావు, డీజీపీ ద్వారకా తిరుమలరావు

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎస్‌ఆర్టీసీ, స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్స్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అఖిల భారత ప్రజా రవాణా సంస్థల అథ్లెటిక్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కైలాసగిరి పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం ఈ పోటీలను ఆర్టీసీ ఎండీ, డీజీపీ ద్వారకా తిరుమలరావుతో కలిసి ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు ప్రారంభించారు. అనంతరం ఏపీఎస్పీ 16వ బెటాలియన్ బ్యాండ్ కెప్టెన్ పాండురంగారావు సహకారంతో మార్చ్‌పాస్ట్ జరిగింది. ఔరంగబాద్, బెంగళూరు, ముంబయి, ఢిల్లీ, గుజరాత్, కల్యాణ కర్ణాటక, కె.ఎస్.ఆర్టీసీ, మహారాష్ట్ర, నార్త్‌వెస్ట్ కర్ణాటక, సేలం, తమిళనాడు, విల్లుపురం, కుంభకోణం, తెలంగాణ ఆర్టీసీ, ఉత్తరప్రదేశ్ ఆర్టీసీ, ఉత్తరాఖండ్ ఆర్టీసీలతో పాటు ఆతిథ్య ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ అథ్లెట్లు మార్చ్ పాస్ట్‌లో అతిథులకు గౌరవ వందనం సమర్పించారు. ఆర్టీసీ చైర్మన్ క్రీడా జ్యోతిని వెలిగించి.. ఆటగాళ్లు వెంకటరావు, ఉమామహేశ్వర్, ధర్మరావు, చక్రధర్‌లకు అందించారు. ఏపీఆర్టీసీ జట్టు కెప్టెన్ శోభామంజరి పోటీల్లో పాల్గొంటున్న జట్ల కెప్టెన్లతో క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. జట్లు ఆటగాళ్ల డ్రిల్స్ ప్రదర్శించారు. తొలుత ముఖ్య అతిథి, ఆర్టీసీ చైర్మన్ వేదిక వద్దకు రావడం ఆలస్యం కావడంతో.. గిరిజన బృందంతో థింసా నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం మెన్ 800 మీటర్ల పరుగుతో పోటీలు ప్రారంభమయ్యాయి.

ఆర్టీసీ ఫాస్టెస్ట్ రన్నర్స్ కేశవ్, ప్రతీక్ష..

మెన్స్ 100 మీటర్ల పరుగులో ఎంఎస్‌ఆర్టీసీకి చెందిన కేశవ్ నాగబంగారు, వుమెన్స్‌లో ముంబయికి చెందిన ప్రతీక్షా సెల్లార్ మీట్ ఫాస్టెస్ట్ రన్నర్స్‌గా నిలిచారు. మెన్స్ విభాగంలో ఎంఎస్‌ఆర్టీసీకే చెందిన రాజేంద్ర ప్రధాన్ ద్వితీయ స్థానం, ఏపీఎస్‌ఆర్టీసీకి చెందిన రాంబాబు తృతీయ స్థానం దక్కించుకున్నారు. వుమెన్స్ విభాగంలో కర్ణాటక ఆర్టీసీకి చెందిన నాగరత్న ద్వితీయ స్థానంలో, ఏపీఎస్‌ఆర్టీసీకి చెందిన ఝాన్సీ తృతీయ స్థానంలో నిలిచారు. మెన్స్ 800 మీటర్ల పరుగులో ఎన్‌డబ్ల్యూకేఆర్టీసీకి చెందిన చంద్రశేఖర్ విజేతగా నిలిచారు. అమిత్ సైనీ, హాలి రాజ్ తర్వాత స్థానాలను సాధించారు. షాట్‌పుట్ విభాగంలో మెన్స్‌లో ఎంఎస్‌ఆర్టీసీకి చెందిన ప్రవీణ్ విజేతగా నిలిచారు. శేఖర్, మంజిగౌడ వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వుమెన్స్‌లో కేఎస్ఆర్టీసీకి చెందిన మమత విజేతగా నిలవగా, సావిత్రి, సంక్రీమా తర్వాత స్థానాలు సాధించారు. వెయ్యి మీటర్ల (50+ వుమెన్) ఫాస్ట్‌వాక్‌లో ముంబయికి చెందిన కల్పన, కీర్తి, శాంతి మొదటి మూడు స్థానాలు సాధించారు.(–50 మెన్) విభాగంలో ఏపీఎస్‌ఆర్టీసీకి చెందిన హేమంత్‌కుమార్ విజేతగా నిలవగా, సత్పాల్, నారాయణ తర్వాత స్థానాలు సాధించారు. 100 మీటర్ల(–50 వుమెన్)లో ఏపీఎస్ ఆర్టీసీకి చెందిన మంజుల విజేతగా నిలవగా, మౌషిని, లక్ష్మి తర్వాత స్థానాల్లో నిలిచారు.